


**(క్రిందటి నెల నుంచి కొనసాగింపు)**

భోజనాలయ్యేక వెంటనే పడుకోవడం అలవాటయింది, రవికి రిటైరయ్యాక, ఇందిర వంటిల్లు సరుకుని వచ్చేలోపులో మంచమెక్కాడు, రవి.

“ఏదో కథ చెబుతానన్నారు. అప్పుడే పడుకుంటే ఎలా?”

"ఇప్పుడు నాకు నిద్ర ముంచుకోస్తోంది. అదీగాక ఆ కథంత హడ్రీబుడ్రీగా అయ్యేది కాదు. నిద్ర లేచాక, నువ్వు ఇచ్చే టీ తాగాక తీరుబడిగా చెబుతాను?”

“అలాగే” అంటూ ఇందిర ఏదో పత్రిక చదువుకోవడంలో మునిగి పోయింది.

టీ తాగుతున్న సమయములో తనూ ఓ కప్పుతో వచ్చి రవి ప్రక్కన కూర్చుంది.

"ఇప్పుడయినా కథ మొదలు పెడతారా?”

రవికి కావలిసిందిదే! ఇందిరకు ఆసక్తి కలిగించి కొంత సస్పెన్సు పెంచి చెప్పాలని అతని ఉద్దేశ్యం.

“మన కడుపున పుట్టిన వాడు, మన ద్వారా ఉన్నత విద్యనభ్యసించిన వాడు, మనచే అప్పలు చేయింది, అమెరికాలో చదివినవాడు, ఇంకామన ఇల్లు అమ్మించి ఆ డబ్బునుపయోగించి తనో ఇల్లు కొనుకున్నవాడు – ఇప్పుడు మనలను ఉన్నపళంగా ఇంటిలోంచి బయటకు పొమ్మంటున్నాడు. ఎందకూ? మనం ఖాళీ చేసే పోర్షన్లో తన అత్తమామలను పెట్టుకొనేందుకు! దానికి నువ్వు నేను ఎంత చెప్పినా నన్నో రకంగానూ, నిన్నోక రకంగానూ వాయించి మన నోళ్లు మూయించాడు, మనమూ కుక్కిన పేనుల్లా, తేలుకుట్టిన దొంగల్లా నోరెత్తకుండా ఉన్నాం! ఎందువలన? ఎందువలన?? బంధుమిత్రులతో మన సంబంధ బాంధవ్యాలు జీరో గనుక ! నా తల్లిదండ్రుల యెడల, నా తమ్ముళ్లు, చెల్లెలు విషయాంలో నేను నిర్వర్తించవలసిన నా బాధ్యతలను పూర్తిగా విస్మరించడం వలన. వాళ్ల కష్టసుఖాల్లో పాలు పంచుకోకపోవడం వలన! దానికి మరోకోణం కూడ ఉంది. ఈ అనుచిత ప్రవర్తన అంతా నా పుట్టింటి వాళ్లమీదే కాని నీ తరపు వాళ్ల మీద చూపక అన్నికార్యక్రమాలు సవ్యంగానే జరుపుతున్నాం! వాళ్ల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూనే ఉన్నాం. ఈ విషయాన్నే వంశీ నీకు, నాకు ఎత్తి చూపడమేకాదు, నేను నా పుట్టింటివాళ్ల మీద చూపిన బాధ్యతారాహిత్యాన్ని తనూ తన పుట్టింటి వాళ్లమీద అనగా మన మీద ప్రయోగిస్తున్నాడు. ఈ విషయంలో ఋజువులు, సాక్ష్యాలు కూడ చూపెడుతున్నాడు. వాడు చూపనక్కరలేదు. అవి నాకే కాదు, నీకూ తెలుసును. పైకి ఒప్పుకున్నా ఒప్పకోకపోయినా! వంశీ ఇంకొక అతి ముఖ్యమైన విషయాన్నీ ఋజువులతో సాక్ష్యాలతో మనముందుంచాడు. మా తల్లిదండ్రులు, తమ్ముళ్లు, చెల్లెలు వాళ్లకుటుంబ ఫంక్షన్స్ ఒకరి కొకరు కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం పూర్తిగా జరుగుతోంది. ఇంకా వివరంగా చెప్పాలంటే నా ఇద్దరు తమ్ముళ్లు, నా చెల్లెలు, మా తల్లిదండ్రులు చేసుకునే అన్ని కార్యక్రమాలకు, పిల్లలతో సహా వెళ్తున్నారు. అల్లాగే వాళ్ల వాళ్ల చిన్న కుటుంబంలోని కష్టసుఖాలు ఒకరికొకరూ పంచుకుంటున్నారు. అంటే కేవలం మనం, మన పిల్లలూ మాత్రం అక్కడ కనపడటం లేదు. ఎందువలన? కారణాలు చెప్పి నీ మీదే పూర్తి నేరం వేయడానికిదంతా నీకు చెప్పడం లేదు. దీంట్లో నీతో పాటూ నాదీ సమానబాధ్యత ఉంది! ఇందిరా ! నిష్పక్షపాతంగా ఆలోచించు! కారణాలు నాకు చెప్పవద్దు! కారణాలు, మన నేరాలు మన కన్నబిడ్డే మనకు తెలియజెప్పాడు. అందుకే వాడికి మనం లోకువ అయిపోయాం! చివరకు మనలను గడ్డిపరకలుగా తీసేసి కోర్టుకూ వెళ్లడానికి వాడు సంకోచించలేదు. అదే మన ప్రవర్తన సవ్యంగా ఉంటే వాడింతకు తెగిస్తాడా? వాడి భార్య అంత బరి తెగిస్తుందా? ఆలోచించు. ఇంతకు ముందే నేను చెప్పినట్లు ఇటీజ్ నాట్ టూలేట్ మనుషులు తప్పలు చేస్తారు. అల్లాగే మనం తప్పలు చేశాం, మనిషైనవాడు తప్పలను అంగీకరించి సరిదిద్దుకుంటే వాడు 'సూపర్ హ్యూమన్’ తప్పలను సరిదిద్దుకోకుండా కప్పిపుచ్చుకొనేవాడు "ఇన్హ్యూమన్ బీయింగ్’. మనం అధములం గాదు. మనుషులమే! నువ్వుగాని, నేను గాని ఇప్పటివరకూ ఎవరి సొమ్మూ ఆశించి వాళ్లకు అన్యాయం చెయ్యలేదు. కనీసం తలపెట్టలేదు. ఇప్పుడు ఆ పనే చేద్దాం, అంటే నేను చెప్పేది. శ్రద్ధగా విను, వాదన కోసం ప్రయత్నించకు. మనం ఈ తప్పలు ఎందుకు చేశామో, దానికి ఎవరు కారణమో ఇప్పుడు చర్చించవద్దు. లేటజ్ రిసార్ట్ టు కరెక్టివ్ యాక్షన్స్ ! మన తప్పలను ఇప్పుడు సరిదిద్దుకునే ప్రయత్నం చేద్దాం. దానికిప్పుడొక సువర్ణావకాశం వచ్చింది."

“ఏమిటా ఒక సువర్ణ అవకాశం?” ఇందిర నోరు విప్పింది.

“చెబుతా వివరంగా చెబుతా! దయచేసి నువ్వునాతో సహకరించు! బంధువుల్లో మీ, మా అనే తేడాలుండవు! అందరూ మన బంధువులే. ఈ సందర్భంలో నీ కొక సంగతి గుర్తు చెయ్యాలి. మన లోకువను బట్టే వంశీ ఈ ప్రకారంగా అన్యాయంగా ప్రవర్తిస్తున్నాడు. ఇంకొకటి కూడ చెప్పాడు, చిన్నవాడయినా పెద్ద మాటే చెప్పాడు. మనం వారితో మన సత్సంబంధాలు పునరుద్ధరించుకుంటే – – – – – “

“పునరుద్ధరించుకుంటే?”

“వాడూ, తన అన్యాయాన్ని సరిదిద్దుకుంటాడని తన చేతలతో చెప్పకనే చెప్పాడు. ఒకవేళ వాడు సరిదిద్దుకోకపోయినా సరిదిద్దుకునేలా నేను చేయగలను. ఈ సందర్భంలో నీ కొక వాగ్దానం చేస్తున్నాను. మనం ఇప్పుడున్న ఇల్లు ఖాళీ చెయ్యకుండా ఫైట్ చేద్దాం. అదే, కోర్టులో న్యాయం మన తరపున ఉన్నప్పుడు వాడూ మనలను కోర్టులో ఏంచేయలేడు. అందువలన..”

“ఇంతకీ మనమిప్పడేం చేద్దామంటారు?"

“దానికీ నీ సహకారం ఉటుందంటేనే నీను నీకు ఏం చేసేది, చెయ్యాలనుకున్నదీ చెబుతాను. ముందు నవ్వు ఆ మాటివ్వాలి."

"అదేంటండీ, మీరింతంగా చెప్పాక, నేను వేరే రకంగా ఎందుకుంటాను? తప్పని సరిగా మీ దారినే నేనూ అనుసరిస్తాను"

“అమ్మయ్యా ! చాలు ఇందిరా! చాలు! నీకు చాలా థ్యాంక్స్. ఇప్పుడు చెబుతాను విను! నా మీద ఎంక్వయిరీ చేసి నన్ను కాపాడిన కృష్ణమోహన్ పెళ్లి కాకినాడలో జరగుతున్నది. మా చెల్లీ వాళ్ళూ ఉండేది కాకినాడలోనే కదా! అందుచేత కృష్ణమోహన్ అత్తవారూ మా చెల్లి జ్యోతి, శివలకు తెలిసిన వాళ్లయి ఉండటానికి ఆస్కారముంది. అందుచేత పెళ్లిలో మనం వాళూ కలవడానికి అవకాశం ఉంది. అక్కడ కలువడానికి ముందే మనం పెళ్లి ఉదయమే మన ఇద్దరం, వీలుంటే మన కోడల్ని తీసుకుని మా చెల్లీవాళ్లింటిలో దిగుదాం, సాయంకాలం అందరం పెళ్లికి కలిసి వెళదాం. నిజానికి మన కుంటుంబానికీ, చెల్లి కుటుంబాలనికి రాకపోకలు తగ్గిపోయాయి కాని వాళూ మనం ఏం దెబ్బలాడుకోలేదు కదా! వెళ్తూ మనం కృష్ణమోహన్ కో సూటూ, ఒక మంచి గిఫ్టూ ఎలాగూ తీసుకుని వెళ్లాలి. ఆ చేతులతోనే మా చెల్లికి, శివకు కూడ బట్టలు తీసుకుని వెళ్లాం, దానితో వాతావరణం కూల్ అవుతుంది. మన రాకపోకలు పునరిద్దరింప బడతాయి. మన పెద్ద కుటుంబంతో మన చిన్న కుటుంబం సత్సంబంధాలు పునరుద్ధరించుకోవడానికిది ఫస్ట్స్టెప్ అని భావిస్తాను. నువ్వూ బాగా ఆలోచించు. పెద్ద కొడుకుగా నా  కుటుంబానికిప్పటి వరకూ ఏరకమైన ఆర్థిక సహకారం అందించలేదు  కాలమే వీటన్నింటికీ ప్రధాన కారణం! ఎప్పటికైనా చెదుని అధిగమించి సన్మార్గంలో వెళ్లడానికి ప్రయత్నించడమే మానవుని కర్తవ్యం! ఆ శుభదినాలు ఇప్పుడొచ్చాయని నేను భావించి నీ కిదంతా చెబుతున్నాను, అదీనువ్వూ మనస్ఫూర్తిగా సహకరిస్తానన్నావు గనుక. భార్యాభర్తలెప్పుడూ ఒక మాట మీద ఉంటే ఆ సంసారం సుఖప్రదంగా ముందుకు వెళ్తుంది. ఇప్పటి వరకూ నా కిష్టమన్నా లేకున్నా నేను నీ మాటకు, నీ పనులను వ్యతిరేకించలేదు. ఇప్పుడు నువ్వూ నా దారిలో నడిస్తే మన శేష జీవితం సుఖమయమవుతుందని నేను నమ్ముతున్నాను.”

“మీరు చెబుతున్నప్పుడే నేను ఆలోచిస్తున్నాను. మీ యీ చెప్పడంలో ఎక్కడా నన్ను వేలుపట్టి చూపకపోయినందుకు ఇందులో నా తప్పు చాలా ఉన్నా–నేను మీకు కృతజ్ఞురాలిని. నేనూ, మీరూ ఒకే రకంగా "ఆపరేషన్ పునరుద్ధరణ' కార్యక్రమంలో హృదయపూర్వకంగా పాల్గొందాం!"

"థాంక్యూ ఇందిరా! మన ఈ రికన్సిలియేషన్ పని చూశాక వంశీగాడికి దిమ్మతిరిగిపోవాలి! అలాగే స్టెప్ బైస్టెప్ మా తమ్ముళ్ళూ, మా తల్లిదండ్రులూ అందరం ఒకరికొకరం ఇచ్చి పుచ్చుకునేలా ప్రయత్నిద్దాం. అందరం ఒకే సమిష్టి కుటుంబంలా మారే రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం!"

★★★

మరునాడు ఏదో పని ఉన్నట్లు బయటకు వెళ్లి వంశీకి రింగిచ్చాడు. స్టేట్స్లో ఉన్న వాళ్లకి రింగిస్తే వాళ్లే తిరిగి మనతో మాట్లాడతార్న సంగతి ఈ మధ్యే తనకు తెలిసింది. మనకయ్యే ఫోన్ బిల్ కన్న వాళ్ల బిల్లు చాలా తక్కువట. అనుకున్నట్లుగానే వెంటనే వంశీ తనకు ఫోన్ చేశాడు.

"ఎల్లాగున్నారు? నాన్నగారూ! అమ్మ మీరు అందరూ క్షేమమే కదా! నేను మీకు కోర్టు ద్వారా నోటిసిచ్చానని నా మీద కోపంగా ఉండటం సహజమే.  ఏం చెప్పమ్మూ నాన్నగారూ, నా పరిస్థితి అలాగొచ్చింది."

రవి కట్చేశాడు “ఆ గొడవలా ఉంచరా! ఇప్పుడు నేనొక విషయం చెబుతాను. ఇది నీ సలహా ప్రకారం చేస్తున్నదే అని సంగతి తెలిశాక నీకు అనిపిస్తుంది" అని తన సస్పెన్షన్, ఎంక్వయిరీ ఆఫీసర్ కృష్ణమోహన్ రావడం, అతని పుణ్యమా అని తను పెద్ద ప్రమాదపు అంచులనుండి బయటపటం, అతను తన మీద ఎంక్వయిరీకి వచ్చే ముందు తన గురించి వాళ్ల అమ్మనడిగి రావడం, ఆమె తన నిజాయితీ గురించి విపులంగా చెప్పి ఏలాగైనా తనని బయట పడెయ్యమని చెప్పడం, అతనా ప్రకారమే తనపై మంచి ఎంక్వయిరీ రిపోర్టు ఇవ్వడం, తన సస్పెన్షన్ ఎత్తేయబడం చెప్పి" వంశీ.. ఇంతకీ అతనెవరో, వాళ్ల అమ్మ ఎవరో అప్పుడు నాకు తెలియదురా!"

"ఎవరు నాన్నా ఈ కృష్ణమోహన్? వాళ్ల అమ్మ ఎవరు? ఆమెకు మీ గురించి అంత బాగా ఎలా తెలుసును?

“ఇవన్నీ నేను అడిగానురా! కాని అప్పుడా అబ్బాయి అవేమీ చెప్పకుండా, అన్నీ తర్వాత మీకు తెలుస్తాయి, సార్" అని తప్పించుకున్నాడు."

“అయితే ఇంతకూ అతడెవరో ఇప్పడైనా తెలిసిందా?”

“అది చెప్పడానికే నీ కిప్పుడు ఫోన్ చేసింది. నేనిప్పుడు ఇంట్లో లేను, బజార్లో ఉన్నాను. నేను చెప్పబోయే విషయాలు అమ్మకు తెలియవు. వాటిని ప్రస్తుతం నువ్వూ చెప్పవద్దు!"

“ఇదంతా నాకు కన్ఫ్యూజన్గా ఉంది నాన్నగారూ!”

'ఏమీ కన్ఫ్యూజన్ లేదు. విషయం తెలిశాక అంతా మంచులా విడిపోతుంది. ఈ మధ్యనే నాకొక శుభలేఖ రిజిష్టరు పోస్టు విత్ ఎక్నాలెడ్జెమెంటు డ్యూ తో వచ్చింది. శుభలేఖ పైన మామూలుగా అన్ని విశేషాల తర్వాత క్రిష్ణమోహన్ వెడ్స్ రాధ అని ఉంది. దాని క్రింద ఆహ్వానించువారి పేర్లు, వాళ్ల ఎడ్రసూ ఉంది.”

"ఓహ్! మా అత్తయ్య, మామయ్య! మీ యీ సస్పెన్సు అంతా నాకిప్పుడర్థమయిపోయింది నాన్నగారూ! అయితే ఈ కృష్ణమోహన్ మీ మేనల్లుడు! అందుకే అతను మీ గురించి మంచిగా తన తల్లి దగ్గర నుండి తెలుసుకుని వచ్చాడన్నమాట! వాట్ ఎ ప్లెజంట్ సర్ప్రైజ్! ఇక మీరు మిగిలింది చెప్పనక్కరలేదు! నాకంతా అర్థమయిపోయింది."

రవికి చాలా సంతోషమేసింది. ఇప్పడు వాడు ఇంటి విషయంలో చేస్తున్న అన్యాయం గురించి తనకే మాత్రం చింతలేదు! వాడికీ ఈ అన్యాయం గురించి అంతగా పట్టింపలేనట్లుగానే ఉంది. మళ్లీ వాడే మట్లాడాడు.

"ఇప్పడు నా కర్థమయింది నాన్నాగారూ, ఈ సంగతి అమ్మకెందుకు చెప్పవద్దన్నారో! అయితే మీ తదుపరి చర్య ఏమిటి?”

"ఇప్పడు నీకు ఫోన్ చేసింది, అందుకే. ఆశుభలేఖ కేవలం కృష్ణమోహన్ పెళ్లి గురించి మాత్రమే చెప్పి అతను ఫలానా వాళ్ల అబ్బాయి అని అమ్మకు చెప్పకుండా ఏదో వంక పెట్టి ఆ శుభలేఖ అమ్మకు చూపించలేదు!”

“మంచిపని చేశారు! నా సూచనని, నా సలహాని మీరు పాటించే మొదటి మెట్టు ఇది! కంగ్రాచ్యులేషన్స్ . యు ఆర్ రియల్లీ గ్రేట్ నాన్నగారూ! సౌమ్యంగా పని జరిపిస్తున్నందుకు నాకూ చాల సంతోషంగా ఉన్నది”

"కాని కథ ఇంతటితో అవ్వదు. మా కూడా నీ భార్యనీ, బిడ్డనీ కూడా పంపితే వాళ్లందరూ ఎంతో సంతోషిస్తారు. మానాన్నగారి ముఖ్యమైన స్నేహితుడి కొడుకు పెళ్లి అని మాత్రమే చెప్పి వప్పించు"

“తప్పకుండా పంపుతాను. అత్తాకోడలూ గొడవపడకుండా చూసుకునే బాధ్యత మీదే.”

"ఆ విషయం నాకు వదిలెయ్! నువ్వు ఆమెని చెప్పి వప్పించాక అదీ వీలయినంత త్వరలో నేను కాకినాడకు రిజర్వేషన్ ఏర్పాటు చేస్తాను. మేమూ మీ ఆవిడను రమ్మని డైరెక్టుగా అడుగుతాం కూడాను.”

“'అల్లాగే నాన్నగారూ! మీకు ఈ రాత్రికే ఫోన్ చేస్తాను. ఈలోగా అమ్మనూ ఈ ఏర్పాటుకు ప్రిపేర్ చెయ్యండి!"

రవి సంతృప్తిగా నిటూర్చాడు. అన్నట్లుగానే వంశీ అదే రాత్రి ఫోన్ చేశాడు.

“మీ కోడలుతో మీరు చెప్పమన్నట్టుగానే చెప్పాను. కాకినాడ ప్రయాణం గురించి ముందు ఒప్పకోలేదు. కాని తర్వాత నా పటుదలతో ఒప్పకుంది. ఆమెకూ అక్కడెవరో తెలిసిన వాళ్లున్నారట. వాళ్లనూ కలవవచ్చునని చివరకు అంగీకరించింది. ఇక మీరు ఫార్మల్గా చెప్పి రిజర్వేషన్ చేయించవచ్చు.”

“థ్యాంక్స్ రా వంశీ! ఇప్పటివరకూ మన ప్రాజెక్టు సవ్యంగానే నడుస్తున్నది. ఇక ముందూ అలాగే ముందుకు జరుగుతుందని ఆశిద్దాం. మీ అమ్మతో ఏ గొడవ జరక్కండా జాగ్రత్తలు తీసుకునే పూచినాదీ. రేపే కోడలుతో చెప్పి రిజర్వేషన్స్ చేయించేస్తాను?”

రవి వంశీతో మాట్లాడిన సంగతి ఇందిరకూ చెప్పి తదుపరి కార్యక్రమానికి ఉద్యుక్తుడయ్యాడు.

★★★

ఎటుపోయి ఎటువచ్చినా, తను ఇల్లు మారాల్సి వస్తే ఏంచేయాలో కూడా రవి ఆలోచించాడు. తన దగ్గర లోన్ తీసికుని ఒక చిన్న ఇల్లు కట్టించిన యుగంధర్ని కలిసివస్తే బాగుంటుందని ఇందిరతోచెప్పి ఒక ఆదివారం పూట బయలుదేరాడు. తాను వస్తున్న సంగతి యుగంధర్కి ఫోన్ చేసి ఎడ్రసు కనుక్కుని ఉదయం అతని ఇంటి బెల్ కొట్టాడు. యుగంధర్ డోర్ తెరిచి ముందు కొంచం తటపటాయించి తర్వాత గుర్తుపట్టారు" రండి రండి మేనేజర్ గారూ! మిమ్మల్నిచూసి చాలా కాలమైపోయిందిగా, అందుకే గుర్తుపట్టడంలో కొంత ఆలస్యమైంది, క్షమించండి!"

“ఇది సహజం యుగంధర్ గారూ! ఏం ఫరవాలేదు!”

“'ఇలా కూర్చోండిసార్, ఈ ఇల్లు మీ చలవే! మీ ముందు మేనేజర్ గారు ఏవో వంకలుపెట్టి నాకు లోన్ ఇవ్వలేదు. మీరు పెద్దమనసుతో ఆ అడ్డంకులను తొలగించి నాకు లోన్ ఇచ్చేరు. మీ దయవలన ఆ లోన్ మొత్తం తీరిపోయింది. నేనూ సంవత్సరంక్రితమే రిటైరయ్యాను కూడ"

“పైన ఏదో అప్పైర్ వేస్తున్నట్లు కన్పిస్తున్నది. మీరు రిటైరయిపోయాక వచ్చిన రిటైర్మెంట్ బెనిఫిట్స్తో వేస్తున్నారా? లేక మరల ఫ్రెష్ లోన్ రైజ్ చేస్తున్నారా?”

“నాకు మరల లోన్ రాదు రవి గారూ, మీకు తెలియందేముంది? రిటైర్డ్ ఉద్యోగులకు మామూలు మార్టిగేజ్లోనురాదు. ఇక నా రిటైర్మెంట్ బెనిఫిట్ అన్నీ ఇంటి మీద లోన్ తీర్చడానికి, మా అమ్మాయి పెళ్లి సందర్భంలోను, పిల్లల పెద్ద చదువులకూ అయిన అప్పులు తీర్చడంలోను ఖర్చయిపోయాయి",

“అయితే,,!?”

"అదంతా పెద్దకథ! ముందు కాఫీ తీసుకోండి' అంటూ భార్య తెచ్చిన కాఫీని రవికిచ్చి తనూ ఒకటి తీసుకున్నాడు.

★★★

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments